అభివృద్ధికి కృషి చేయండి : ఎంపీ

ప్రజల అభివృద్ధికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కృషి చేయాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్.. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. రంజాన్ మాసంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. – మెహిదీపట్నం, మార్చి 9

గ్రామ గ్రామాన సమరభేరి సభలు

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

కాచిగూడ, మార్చి 9: బీసీల సమస్యల పరిష్కారానికి తెలంగాణలోని గ్రామ గ్రామాన సమరభేరి సభలను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర బీసీ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎల్.శ్రావణిని నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేశారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ..బీసీలకు 42 శాతం పెంచిన రిజర్వేషన్లకు అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో దేశంలో బీసీ విప్లవం తప్పదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, సుధాకర్, రాజేందర్, అనంతయ్య, నిఖిల్, రాజ్‌కుమార్, బాలయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

దోమలతో ఉక్కిరి బిక్కిరి..!

- అరకొర ఫాగింగ్.. పెరుగుతున్న దోమలు
- మురుగునీటి నిల్వలతోనే ఎక్కువ..
- ఎమ్మెల్యే ఆదేశించినా మారని తీరు..
- అంబర్‌పేటలో పెరిగిపోతున్న విషజ్వరాలు

గోల్నాక, మార్చి 9: అంబర్ పేటలో రోజు రోజుకూ దోమలు పెరిగిపోయి పంజా విసురుతున్నాయి. నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు అరకొర ఫాగింగ్‌చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. గత నెలతో పోలిస్తే ఈ నెలలో ఈ కేసులు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. దోమల నివారణకు సరైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి నిల్వ ప్రాంతాలే నిలయాలు..

అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్ పేట, బాగ్‌అంబర్ పేట, గోల్నాక, తదితర డివిజన్లలోని పలు ప్రాంతాల్లో తరచూ మురుగునీరు నిలవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. ఆయిల్ బాల్స్, యాంటీ లార్వా ప్రోగ్రామ్స్ చేపట్టకపోవడంతో నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు పెరిగిపోయాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు అంబర్‌పేట వాసులు దోమలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

కోట్లు ఖర్చు చేస్తున్నా తీరని బెడద..

దోమల నివారణకు జీహెచ్ఎంసీ ఎంటామాలజీ విభాగం ప్రతి డివిజన్‌లో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఆటో ఫాగింగ్ మెషిన్లు, హ్యాండ్ మెషిన్లు, ఆటోలకు డీజిల్, పెట్రోల్‌తో పాటు సిబ్బందికి జీతభత్యాలు.. ఇలా వివిధ అవసరాల కోసం ఏటా సుమారు రూ. కోట్లకుపైగానే ఖర్చు చేస్తున్నారు. కానీ, కొంత మంది సిబ్బంది ఫాగింగ్ అవసరాలకు వినియోగించాల్సిన పెట్రోల్, డీజిల్‌ను సగం కూడా ఖర్చు చేయకుండానే పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డివిజన్లలో కొంతమేర ఫాగింగ్ చేయడం, ఆ తర్వాత తమకు తెలిసిన వాళ్లతో సంతకాలు తీసుకుని వెళ్లిపోతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు.. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విషయంపై గ్రేటర్ అధికారులు ఫోకస్ పెడితే అసలు విషయాలు బయటపడతాయనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే సమీక్షించినా మారని తీరు..

నియోజకవర్గ వ్యాప్తంగా దోమల బెడద తీవ్రంగా ఉందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇటీవల జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులతో అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. దోమల పెరుగుదలకు గల కారణాలను ఆయన అడిగి తెలుసుకొని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. అయినా అధికారుల తీరులో మాత్రం మార్పు రాలేదు.. వాతావరణ మార్పులతో పాటు పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండటంతో అంబర్‌పేటలో దోమలు విజృంభిస్తుండటం, విషజ్వరాల కేసులు పెరిగిపోతుండటం కలవరపెడుతోంది. దోమల నివారణకు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట వాసులు కోరుతున్నారు.

ఇటీవల దోమల నివారణపై జరిగిన సమీక్షా సమావేశంలో ఎంటమాలజీ అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నివారణ చర్యలు చేపడుతున్నాం..

అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పెరిగిన దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.. ఎమ్మెల్యే సూచన ల మేరకు దోమలు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రతి రోజూ ఫాగింగ్ చేపడుతున్నాం..నీరు ని ల్వ లేకుండా ఇంటి శుభ్రంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.. దోమల బెడద ఉన్నవారు మాకు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– అంబిక, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్

అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ దివస్‌ను పాటిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి , తదితరులు

అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ దివస్

రవీంద్రభారతి, మార్చి9 :తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ దివస్‌ను నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు హాజరై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలపై ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ వేసి గుర్తింపు కార్డులను జారీచేయాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్కరికి 250 గజాల ఇంటి స్థలం, ఫెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, కొండ స్వామి, ఐలయ్యయాదవ్, అర్కే భూపాల్, జగన్‌యాదవ్, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ఏడుగురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. – మెహిదీపట్నం, మార్చి 9

బాలాజీ నగర్‌లో మహిళా దినోత్సవం

మెహిదీపట్నం మార్చి 9: గుడిమల్కాపూర్ డివిజన్, బాలాజీ నగర్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కాలనీ మహిళలు పాల్గొని, స్త్రీ శక్తి ప్రాముఖ్యతను గొప్పగా వివరించారు. కాలనీ పెద్దలు మాధవ రెడ్డి, గోపాల్ శర్మ , శేరి రామ్ రెడ్డి, మామిడి వెంకటేశ్, వెంకటర మణలు స్త్రీల పాత్ర సమాజంలో వారి గొప్పతనం గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు శ్రీనివాస్ గౌడ్.. 'స్త్రీ మహత్యం' గురించి పాట ఆలపించి అందరినీ అలరించారు. స్త్రీ అంటే కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక సృష్టి శక్తి అని.. అమ్మగా, అక్కగా, భార్యగా, కుమార్తెగా – ప్రతి రూపంలో ప్రేమ, ధైర్యం, త్యాగం, శక్తి పొదిగి ఉన్న మహోన్నతమైన వ్యక్తిత్వమే స్త్రీ అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, కాలనీ ప్రధా న కార్యదర్శి సామ సురేందర్ రెడ్డి అన్నారు. మహిళలను ఘనంగా సన్మానించడంతో పాటు, ప్రత్యేకంగా శాలువాలతో సత్కారం చేసి వారి గొప్పతనాన్ని గౌరవించారు. అనంతరం కేక్ కట్‌చేసి, పిల్లలతో డాన్స్ ప్రోగ్రాం నిర్వహించి ఉత్సాహంగా ముగించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించిన దృశ్యం

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

అంబర్‌పేట, మార్చి 9: బాలబాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని అం బర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రేంనగర్ ప్లేగ్రౌండ్‌లో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. దీనికి కార్పొరేటర్ హాజరై మాట్లాడుతూ.. పిల్లలు కరాటే నేర్చుకునేలా ప్రోత్సాహించడం అభినందనీయమని అన్నారు. ప్రేంనగర్, పటేల్ నగర్ వాసులు తమ పిల్లలకు కూడా కరాటే నేర్పించాలని తెలిపారు. సెన్సెయ్ సుదర్శన్, టీజీ చీఫ్ ఎగ్జామినర్ సెన్సెయ్ విశ్వనాథం, టీజీ ఆర్టీసీ కరాటే కోచ్ ఫర్ లేడీ కండక్టర్స్ సెన్సెయ్ దామోదర్ నాయక్, నవీన్‌నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోసిన్ పాల్గొన్నారు.

అడిక్‌మెట్‌లో బొడ్రాయి పూజ

సుల్తాన్ బజార్, మార్చి 9 : అడిక్‌మెట్‌లో ఘనంగా బొడ్రాయి పూజను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా సత్యనారాయణ ఆధ్వర్యంలో తొమ్మిదవ సంవత్సరం కూడా బొడ్రాయి పూజను నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో వాణి, ప్రకాశ్, రాధిక, హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరకు నారీశక్తి లెజెండరీ అవార్డును అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి

నారీశక్తి లెజెండరీ అవార్డులు బహూకరణ

రవీంద్రభారతి,మార్చి 9 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వల్లూరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రవీంద్ర భారతిలోని మెయిన్‌హాల్‌లో వివిధ రంగాల్లో సేవలందించిన సమాజసేవకులను గుర్తించి నారీశక్తి లెజెండరీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సామాజిక సేవకురాలు పసుల ఇందిరలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి నారీశక్తి లెజెండరీ అవార్డు 2025లను బహూకరించారు. అనంతరం శ్రీలతరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు సమాజసేవకుల కృషి ఎంతో అభినందనీయమన్నారు. సమాజమే దేవుళ్లుగా భావించి అభివృద్ధే లక్ష్యంగా సేవ చేస్తున్న సామాజిక సేవకురాలు పులస ఇందిరలాంటివారు సేవచేయడం అభినందనీయమన్నారు. సమాజ సేవకులకు అవార్డులు ఇవ్వడం వల్ల వారు సమాజానికి మరింతగా సేవచేస్తారని, వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ వల్లూరి శ్రీనివాస్‌ను ఆమె అభినందించారు.

దళిత బహుజనులకు ఆదర్శప్రాయుడు శ్రీకృష్ణ

శ్రీకృష్ణను సత్కరిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కని వెంకటయ్య, దళితబహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

రవీంద్రభారతి,మార్చి 9 : ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జెనెటిక్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించిన పబ్బతి శ్రీకృష్ణను బషీర్‌బాగ్‌లోని డాక్టర్ అంబేద్కర్ రిసార్ట్స్ కేంద్రంలో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కని వెంకటయ్య, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీమ్ కోర్టు న్యాయవాది వడ్లమూరి స్వరూప్, ప్రొఫెసర్ వెంకటదాసు, తదితరులు విచ్చేసి శ్రీకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా బక్కని వెంకటయ్య మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలపై పోరాటం చేస్తూ జనటిక్ విభా గంలో గుండెపోటు లాంటి గొప్ప అంశాలపైన పీహెచ్‌డీ చేయడం చాలా అద్భుతమన్నారు. వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ.. పాలమూరు ప్రాంతం పేద ఎస్సీ కుటుంబం నుంచి ఉన్నత చదువులు చదువుకొని యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన పబ్బతి శ్రీకృష్ణను అభినందించారు. శ్రీకృష్ణ దళితబహుజనులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం శ్రీకృష్ణను సాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాసరి లక్ష్మణ్, వినయ్, నక్క దేవేందర్‌రావు, సంకిప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప అగ్నిప్రమాదం

సుల్తాన్ బజార్, మార్చి 9. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీ ఐటీఐ గిల్డ్ వద్ద శనివారం రాత్రి స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు నాంపల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ నాయుడు మాట్లాడుతూ.. విజయనగర్ కాలనీ ఐటీఐ గిల్డ్ వద్ద పేరుకుపోయిన చెత్తలో మంటలు చెలరేగి వ్యాప్తి చెందాయని, సకాలంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని తెలిపారు.

డ్రగ్స్ విక్రయం.. ముగ్గురు అరెస్ట్

సుల్తాన్ బజార్, మార్చి 9: డ్రగ్స్‌కు అలవాటు పడిన ఇద్దరు యువకులతో పాటు విక్రయిస్తున్న మరో వ్యక్తిని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కు సంబంధించి ఆఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌లోని కోల్సావాడికి చెందిన దీపక్(27), ఫీల్‌ఖానకు చెంది న ఘనాశ్యామ్ (32)లు డ్రగ్స్‌కు బానిసయ్యారు. వీరిపై కొంత కాలంగా నార్కోటిక్స్ బ్యూరో అధికారులు నిఘా పెట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు కోల్సావాడీలోని దీపక్ ఇంటిపై దాడి చేశారు.దీపక్ తో పాటు ఘన్ శ్యామ్‌ను అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారికి రక్త , మూత్ర పరీక్షలు నిర్వహించారు. నివేదికలో డ్రగ్స్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో తమదైన శైలిలో పోలీసులు ప్రశ్నించారు. మల్కాజిగిరికి చెందిన పంకజ్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. వీరిచ్చిన సమాచారం మేరకు మల్కాజిగిరీలోని పంకజ్ ఇంటిపై దాడి చేసి అతడిని అరెస్ట్‌చేసి, వారి నుంచి 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి డ్రగ్స్ తీసుకు వచ్చి నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన యువకులే లక్ష్యంగా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని ఆయన తెలిపా రు.ఈ మేరకు ఆఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారం దిశగా విశ్వబ్రాహ్మణులు ఎదగాలి

- శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి
- ఘనంగా విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవ వేడుకలు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 9 : రాజ్యాధికారం దిశగా విశ్వబ్రాహ్మణులు ఎదగాలని శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఆకాంక్షించారు. నాంపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో కులవృత్తులు బాగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలను అభ్యసించి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ జాతిని అభ్యుదయ పథంలోకి నడిపించడానికి ధర్మ పీఠం ఇతరులకు మార్గదర్శకంగా పనిచేయాలని అన్నారు. స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక, గ్రంథాలు, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెకంటి వెంకటరమణ రాసిన వ్యాసాల సంపుటి కాకతీయ వ్యాస మంజరి అనే పుస్తకాన్ని, విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం సంచాలకులు చొల్లేటి కృష్ణమాచార్యులు రచించిన విశ్వశిల్పి రామప్ప రమణీయ శిల్ప కళ నవలను మధుసూదనాచారి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్యను, జాతీయ శిల్పి డాక్టర్ వేలు ఆనందాచారిలను స్వర్ణోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన సభలో సనాతన ధర్మ పరిరక్షణ–విశ్వబ్రాహ్మణ పాత్ర, వేదాలలో విశ్వకర్మ ప్రస్థానం అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, డాక్టర్ లాలుకోట వెంకటాచారి, దైవజ్ఞశర్మ, కుందారపు గణేశ్‌చారి, నారోజు మనోరమ, చిలుకూరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా కళ్ళెపల్లి అమరనాథ్ బృందంచే రుంజ వాయిద్య ప్రదర్శన, పేరిణి సందీప్ నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.



విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా సత్కరిస్తున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

మతపర సమస్యలు తలెత్తకుండా చర్యలు

మెహిదీపట్నం మార్చి 9: ప్రజలకు మతపర సమస్యలు లేకుండా ఉండడానికి ఆలయాలు, మసీదుల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన ఆలయాలు, రోడ్ల పక్కన ఉన్న మసీదుల కమిటీల ప్రతినిధులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ .. ప్రస్తుతం నగరంలో పండుగల వాతావరణం నడుస్తున్న నేపథ్యంలో మతపర సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆ లయం, మసీదు వద్ద ఓ కానిస్టేబుల్‌ను నియమిస్తున్నామని అన్నారు. అన్ని కమిటీల వారు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిం చాలని ఏసీపీ కోరారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ పాల్గొన్నారు.

గుడుంబా రహిత ధూల్‌పేట్‌గా తీర్చిదిద్దుదాం..

డీసీపీ అనోక్ జయకుమార్, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్, ధూల్‌పేట్ ఆపరేషన్ ఇన్‌చార్జి అంజి రెడ్డి

సుల్తాన్‌బజార్, మార్చి 9 : ధూల్ పేట్‌లో ఎంతో మంది మహిళా విద్యావంతులు ఉన్నారని, గుడుంబా రహిత ధూల్‌పేట్‌గా తీర్చిదిద్దడంలో తమ వంతు సహకారం అందించాల ని డీసీపీ అనోక్ జయకుమార్, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్, ధూల్‌పేట్ ఆపరేషన్ ఇన్‌చార్జి అంజి రెడ్డి మహిళా దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహి ళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీ హాయ్ శక్తి ఉమెన్ ఈజ్ పవర్ అనే కార్యక్రమాన్ని గోషామహల్‌లోని ధూల్ పేట్, రహింపురాలలో నారీశక్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సంఘ సేవకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్, ప్రధాన నిర్వాహకురాలు కరిష్మా సింగ్, సంజనా సింగ్, ఓషికా సింగ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. మహిళల నైపుణ్యాన్ని వెలికితీయడానికి వంటలు, కేస్ స్టడీ, మేకప్, హెయిర్‌స్టైల్, మెహందీ, ఫొటోగ్రఫీ, ట్రెజర్ హంట్, పజిల్ సాల్వింగ్, కిడ్స్ డ్రాయింగ్, ఫ్యాషన్ పోటీలతో సహా 13 ఉత్తేజకరమైన పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు, చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ... మహిళా సాధికారతతో సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని అన్నారు. మహిళలు విద్యలో రాణించినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.

గుడుంబా రహిత ధూల్‌పేటగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ము ఖ్యం అని వారు తెలిపారు. మార్పు దిశగా తీసుకెళ్తున్న నిర్వాహకులను వారు ప్రత్యేకం గా అభినందించారు. సమానత్వం యొక్క ప్రాముఖ్యతను ఎత్తిచూపుతూ సమాజంలో సాధికారత ఉద్యమం ఆవశ్యకత ను వివరించారు. ఈ కార్యక్రమంలో జయేశ్, డాక్టర్ కవితా ఠాకూర్, డాక్టర్ కీర్తి సునీల్ బిద్నూర్, ఆనంద్‌సింగ్ లోథ్, అడ్వకేట్ రాజ్‌నందనీసింగ్, పప్పు మాత్రే, నికిత, శంకర్ సింగ్ జమేదార్, మనీశ్‌సింగ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న నారీ శక్తి మహిళా సభ్యులు

రైళ్లలో దొంగతనాలు..

కాచిగూడ,మార్చి 9: ఎలాహంక రైల్లో ప్రయాణికురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు స్నాచింగ్‌కు పాల్పడ్డారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. బెంగుళూరు ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ భార్య కె.హారిక ఎలాహంక రైల్లో కాచిగూడకు వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లాలోని మనోపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు స్లో కా వడంతో గుర్తుతెలియని వ్యక్తులు రైల్లోకి ప్రవేశించి హారిక మెడలో ఉన్న 40 గ్రాముల మంగళ సూత్రాన్ని లాక్కొని పారిపోయారు. ఆదివారం హారిక కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

వెంకటాద్రి రైల్లో.....

వెంకటాద్రి రైలులో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కొండాపూర్ ప్రాంతానికి చెందిన దినేశ్ భార్య తనుజ వెంకటాద్రి రైలులో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య మనోపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగ్‌లోంచి 20 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించారు. తనుజ ఆదివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సిఐ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDL. DISTRICT & SESSIONS JUDGE : AT KUKATPALLY.
O.S.No. 337 of 2022
Between:
1. Siraswal Meva, W/o. Siraswal Dara Singh & Others ...Petitioners
And
1. M/s. Vasantha Estates & another ...Defendants
To
1. M/s. Vasantha Estates Rep. by its Managing Partner, Sri. Vasantha Venkata Krishna Prasad, S/o. Vasantha Nageshwara Rao, Aged about 52 years, Occ: Business, R/o. H.No. 142, Rao & Raj Colony, Banjara Hills, Road No.2, Hyderabad.
2. D.V. Satyanarayana Raju S/o. D.V. Krishnam Raju, aged about 76 years, Occ: Business, R/o: H.No. 2-2-23/22/24, Bagh Amberpet, Hyderabad.
Please take notice that the petitioners/ appellants herein had filed the above O.S. No. 337/2022 and the Hon'ble court posted the above matter on **24-03-2025** for your appearance. Hence, you are hereby directed to appear before the above said court and to file counter if any, failing which the matter will be decided in your absence
//BY ORDER O